# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 07 మార్చి 2025


## ఆగిన ట్రాక్టర్లు ఢీకొన్న కంటైనర్ లారీ

### ఇద్దరు మృతి పలువురికి గాయాలు

యర్రగుంట్ల మార్చి 06 ప్రభాతవార్త



మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో ట్రాక్టర్ ను లారీ ఢీకొన్న సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తలారి లక్ష్మీదేవి (52) అక్కడికక్కడే మృతి చందగా, వెంకట ఆంజనేయులు (50) ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు మిగతా ముగ్గురికి గాయాలు అయ్యాయని యర్రగుంట్ల పోలీసులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిలమకూరు నుంచి నిడిజీవ్వి నాపరాయి గనులకు పనులకు పోతుండగా ముద్దనూరు వైపు నుంచి వస్తున్న లారీ అధిక స్పీడుతో వచ్చి ట్రాక్టర్ వెనుక భాగంలో ఢీకొంది. ఢీకొన్న ప్రాంతం నుండి దాదాపు 5 మీటర్ల దూరంలో ఆగిన ట్రాక్టర్. ఈ ప్రమాదంలో తలారి లక్ష్మీదేవి,వెంకట ఆంజనేయులు మృతి చెందగా రోశయ్య, ఓబయ్య, గుర్రప్పలతో పాటు సుబ్బయ్య, బాలయ్య, హరినాథ్, ఓబయ్య, గాయాలు అయినవి. వెంటనే స్థానికులు 108 వాహనం లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గ్రామ ఉద్యాన సహాయకులకు ఉద్యాన పంటలు మరియు స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్ ప్లాన్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క సదస్సుకు కెవికె సైబీకే ఊటుకూరు శాస్త్రవేత్త మానస, జిల్లా ఉద్యాన అధికారి ఎస్ఎస్సి సుభాషిని, పిడి ఏపీఎంఐపి వెంకటేశ్వర్ రెడ్డి, ఉద్యాన అధికారులు, డిజిటల్ గ్రీన్ సిబ్బంది వెంకట గౌడ్, సహాయకులు ప్రవీణు మరియు గ్రామ ఉద్యాన సహాయకులు, ఈ కార్యక్రమానికి హాజరవ్వడం జరిగింది.

## అమ్మో 0262 బస్సా ! అంటున్న ప్రయాణికులు

- వైరుధ్య రాజధానికి కాలం చెల్లిన బస్ సర్వీస్ లు
- కొత్త వాహనం కు పర్మిట్ వచ్చిన నడపని వైనం
- హైదరాబాద్ సర్వీస్ బస్ ని అంటగట్టే ప్రయత్నం
- చెన్నైకి ఆర్టీసీ ప్రయాణం అంటే బెంబేలు పడుతున్న ప్రజలు

పులివెందుల, మార్చి6, ప్రభాతవార్త:

పులివెందుల నుంచి ఆర్టీసీ డిపో నుంచి అంతర్జాతీయ స్థాయిలో పేరు గాంచిన వాణిజ్య రాజధాని అయిన వైరుధ్య నగరమైన చెన్నైకి కాలం చెల్లిన బస్ సర్వీస్ లు నడుపుతూ ప్రయాణికులకు ఆర్టీసీ బస్ ఎక్కాలి అంటే బెంబేలు ఎత్తే లాగా చేశారు. ప్రస్తుతం వున్న పులివెందుల డిపో ఉన్నత అధికారుల తీరు చూసి అందరూ నోరెళ్ళ పెడుతున్నారు.వేల కిలోమీటర్లు తిరిగి కాలం చెల్లిన బస్ సర్వీస్ లను అంత రాష్ట్రాలకు నడుపుతున్నారు. సుదూర ప్రాంతాలకు నడు పుతున్న ఈ కాలం చెల్లిన బస్ సర్వీస్ లు ఎపుడు ఆగిపోతాయో తెలియని పరిస్థితి. చెన్నై నుంచి తిరుగు ప్రయాణం లో కూడా చాలా సార్లు రిపైర్లు వచ్చి ఆగిపోవడంతో రిజర్వేషన్ చేయించుకొని పని మీద వచ్చే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు ఎన్నో జరిగాయి అని ప్రయాణికులు వాపోతున్నారు.

### అమ్మో 0262 బస్సా ! అంటున్న ప్రయాణికులు

చెన్నై కి వెళ్ళే ప్రయాణికులు ఆర్టీసీ బస్ సర్వీస్ ఏపీ 04 జడ్ 0262 అంటే చాలు అమ్మో ఆ బస్సా వద్దు నాయనా కావాలంటే ప్రయాణం వాయిదా వేసుకుందాం అంటూ పలువురు ప్రయాణికులు బస్ ఎక్క కుండా వెళుతున్నారు. ఎందుకో అని అంటే దానికి ఎప్పుడు రిపేర్లు అని నిన్న మంగళవారం కూడా రిలయన్స్ పెట్రోల్ బంకు కాడికి వస్తానే బ్రేక్ డౌన్ అయింది.ఇలా ఎన్నో సార్లు ఇబ్బంది పెట్టిన సందర్భాలు చాలానే వున్నాయి.

### వైద్యం కోసం వెళ్ళే ప్రజల ఇక్కట్లు

చెన్నై అంటేనే దక్షిణ భారత దేశంలో ఆరోగ్య నగరంగా పేరు గాంచిన విషయం తెలిసిందే. అలాంటి చెన్నై నగరానికి వైద్యం కోసం పులివెందుల, కడప జిల్లా నుంచి వేల సంఖ్యలో వెళుతున్నారు. చెన్నైకి వెళ్ళాలి అంటే రైలు,లేదా ఆర్టీసీ నే దిక్కు కానీ కాలం చెల్లిన బస్ సర్వీస్ ల వల్ల చికిత్స కోసం వెళ్ళే ఎంతో మంది వ్యాధి గ్రస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

### విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు ఆర్టీసీ

నిద్రా హారాలు మాని కష్ట పడి చదివి భవిష్యత్ పై ఎన్నో కలలు కంటూ ఇంటర్యూ లకు హాజరు కావడానికి చెన్నై కి వెళ్ళాల్సిన విద్యార్థులు ఆర్టీసీ పై నమ్మకంతో బస్ లలో వెళుతున్నారు. కాలం చెల్లిన బస్ సర్వీస్‌లు మార్గమధ్యంలో రిపైర్‌కు రావడం ఆగిపోవడంతో సమయానికి వెళ్ళలేక ఉద్యోగ అవకాశాలు కోల్పోయి ఇబ్బందులు పడినట్టు సమాచారం.



కొత్త వాహనాలకు పర్మిట్ వచ్చిన నదపని వైనం

చెన్నైకి పులివెందుల డిపో నుంచి రాయచోటి మీద ఒక సర్వీస్ కడప మీదుగా రెండు సర్వీస్ లు నడుస్తున్నాయి. ఈ మూడు సర్వీస్ లలో నడుస్తున్న బస్ సర్వీస్ ల స్థానంలో కొత్త బస్ లు వచ్చాయి వాటికి పర్మిట్లు కూడా వచ్చి మూడు వారాల పైన అయినట్టు సమాచారం.కానీ కొత్త బస్ లను నడప కుండా కాలం వెళ్ళ బుచ్చడమే కాకుండా హైదరాబాద్ కు కొత్త బస్ లో రావడం అక్కడ ముందు నడిపిన కాలం చెల్లిన బస్ ను ప్రస్తుతం చెన్నైకి నడుపుతుండటం పలు విమర్శలకు తావిస్తోంది.

### కొత్తబస్‌లను హైదరాబాద్‌కు నడిపే దిశగా ప్రయత్నాలు

పులివెందుల డిపో ఉన్నతి అధికారులు చెన్నైకి పాత బస్ ల స్థానంలో మంజూరు అయి,పర్మిట్ కూడా వచ్చిన నూతన బస్ ను హైదరాబాద్ కు నడపాలని ఆలోచనలో ఉన్నట్టు గుస గుసలు వినిపిస్తున్నాయి. మూడు వారాల క్రితమే అనుమతులు వచ్చిన నూతన బస్ ను నడప కుండా హైదరాబాద్ కు వెళ్ళే కాలం చెల్లిన బస్ అయిన ఏపీ04 జడ్ 0262 బస్ ను నడపడం బలాన్ని చేకూరుస్తున్నాయి.

### చెన్నైకి ఆర్టీసీ ప్రయాణం అంటే బెంబేలు ఎత్తుతున్న ప్రజలు

చెన్నైకి ప్రజలు ఈ కాలం చెల్లిన బస్ లలో ప్రయా ణించాలి అంటే బెంబేలు ఎత్తు తున్నారు. ఆర్టీసీ బస్ లో పోవడం కంటే రైలు లో ప్రయాణించడం మేలు అంటూ అటు వైపు ప్రయాణాలు సాగిస్తున్నారు. దీనితో పులివెందుల ఆర్టీసీ డిపో కి రావాల్సిన అధాయంకు గండి పడుతోంది. కావున ఇపుడైన పులివెందుల ఆర్టీసీ డిపో అధికారులు మొండి వైఖరి మాని ప్రయాణికుల భద్రత ను దృష్టిలో పెట్టుకొని కాలం చెల్లిన బస్‌ల బదులుగా నూతన బస్ లను నడిపేలా చర్యలు తీసుకుంటే మంచిది అని ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న చామకూరి శ్రీధర్

పీలేరు మార్చి 6 ప్రభాతవార్త:

ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక , గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన వాటికి నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం పీలేరు తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్ మరియు రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల గురించి గ్రామాల వారీగా రెవిన్యూ అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షించారు. ఇందులో భాగంగా పిజిఆర్ఎస్ లో ఇంకను 80, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వాటిలో 56 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయన్నారు. వీటిని ఒక వారంలోగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించి కార్యాలయాలు చుట్టూ తిరగకుండా పరిష్కార మార్గాలు చూపాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో వెనుకబడిన గ్రామాల వీఆర్వోలను కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవిన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం మన అందరి బాధ్యత. ఈ సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడమే అధికారుల లక్ష్యం కావాలన్నారు. వచ్చిన అర్జీలలో మ్యూటేషన్స్, అసైన్మెంట్, ఆర్ఓఆర్, భూసేకరణ, దారి సమస్యలు, ఫోతి కేసులు, అన్నదమ్ముల భాగ పరిష్కారాలు, డిస్ప్యూట్స్, సివిల్ కేసులు తదితరాలను సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.

### ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి:

మండలంలో ప్రభుత్వ భూములను ఎక్కడైనా ఆక్రమణలు జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలన్నారు. రెవిన్యూ, సర్వే, పోలీసు శాఖలతో బృందాలను ఏర్పాటు చేసుకొని ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం విధంగా చర్యలు తీసుకోవాలని ఇందులో ఎవరి ఒత్తిడికి లోనుకాకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రామా, తహసిల్దార్ భీమేశ్వర రావు, ఎంపిడిఓ, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వోలు వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌షాపులపై అధికారుల నిర్లక్ష్యం

- : బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇస్తున్న డీలర్లు
- : బియ్యాన్ని ఎక్కువధరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వైనం
- : ఇంతజరుగుతున్నా ఏమి తెలియనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- : నెల మాముళ్ళతో సరిపెట్టుకుంటున్న అధికారులు

బద్వేలు , మార్చి 6 (ప్రభాతవార్త) :

రేషన్‌బియ్యాన్ని డీలర్లు సమయానికి ఇవ్వకుండా బియ్యం అయిపోయాయనే సాకు చూపుతూ లబ్ధిదారులకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు .ప్రతి నెలా 1వ తేదినుంచి 15వ తేది వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా నాలుగురోజులు మాత్రమే పంపిణీ చేసి బియ్యం అయిపోయాయని రూ.10నుంచి 15లు ఇచ్చి ఆ లబ్ధిదారుల బియ్యాన్ని రూ.20లకు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని డీలర్ తీసుకున్న వెంటనే పంపిణీ చేస్తున్న సమయంలో అధికారుల నిఘా పూర్తిగా విఫలమైంది. స్టాక్ లిస్టు పరిశీలించాల్సిన అధికారులు నచ్చితే పోవడం, నచ్చకపోతే అటువైపు వెళ్లకపోవడం వలన డీలర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి విజిలెన్స్ అధికారులు తనిఖీకి వచ్చేవారు ఇప్పుడు వారు కూడా తనిఖీలు చేయడం లేదు. తనిఖీలు చేపడితే ప్రతి డీలర్ బాగోతం బయటపడుతుంది. ఆకస్మిక తనిఖీల పేరుతో ఒక అధికారికి కూడా రేషన్ షాపువైపు కన్నెత్తి చూసేవారు కనపడడం లేదు. స్థానికంగా ఉండే అధికారులు మాకెందుకులే అన్నట్లుగా వ్యవహరించడం, ఒకవేళ డీలర్లను ఎవరైనా లబ్ధిదారులు ప్రశ్నిస్తే నెల మాముళ్లు ఇస్తున్నాం మాకేమి అవుతుంది అన్నట్లుగా మాట్లాడుతున్నారు. కొంతమంది డీలర్లు తమ హకుంను జారీ చేస్తూ మా దగ్గకు వచ్చే డీలర్లు ఉన్నారా అని మాట్లాడుతున్నారు.ఈ మధ్యకాలంలో డీలర్ల వ్యవస్థ అస్తవ్యస్థంగా మారి, ప్రజలకు బియ్యాన్ని పంపిణీ చేసిన దాఖలాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రతి విషయం తెలిసినప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బద్వేలు, గోపవరం మండలాలలో డీలర్లు ఆడిందే ఆట, పాడిందేపాటగా ఉందన్నారు. ఇది అధికారుల వైఫల్యమా లేక లబ్ధిదారులకు ఎగనామం పెట్టేందుకు అధికారులు కూడా డీలర్లకు వత్తాసు పలుకుతున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేసిన సమయంలో కూడా డీలర్లు నేరుగా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఇచ్చిన సమయంలో కూడా డీలర్లు అలాగే వ్యవహరిస్తున్నారు తప్ప లబ్ధిదారులకు బియ్యాన్ని ఇవ్వడం లేదు. ప్రతి పేదవాడికి రేషన్ ద్వారా వచ్చే నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ప్రభుత్వం చెబుతుంటే డీలర్లు మాత్రం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌కు వెళ్లేది ప్రతి అధికారికి తెలుసు అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. వ్యవస్థ ఇలాగే తయారైతే రేషన్‌షాపుకు వచ్చే బియ్యం మొత్తాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి ప్రజలకు ఎగనామం పెట్టే పరిస్థితి వస్తాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రేషన్‌షాపులపై అధికారుల నిఘా పెంచి ప్రతి లబ్ధిదారునికి బియ్యం అందేలా చేసి 1వతేది నుంచి 15వ తేది వరకు రేషన్‌షాపులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.



బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు (ఫైల్ ఫోటో)

## అభివృద్ధిలో జిల్లాను

# అగ్రగామిగా నిలుపుదాం

- ఆకాంక్ష జిల్లాల ఆశయసాధన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్
- కేంద్ర ప్రభుత్వం నుండి హాజరైన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్,డిపార్ట్మెంట్ ఆఫ్ పోస్ట్స్ డా.సచిన్ మిట్టల్




కడప మార్చి 6 ప్రభాతవార్త :

ఆకాంక్ష జిల్లాల (ఆస్పిరేషన్ డిస్ట్రిక్ట్స్) ఆశయాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ బోర్డు రూమ్ హాలు నుండి "ఆకాంక్ష జిల్లాల ఆశయసాధన కార్యాచరణ ప్రగతి"పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నుండి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డిపార్ట్మెంట్ ఆఫ్ పోస్ట్స్ డా.సచిన్ మిట్టల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా.. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. "నీతీ ఆయోగ్" ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. అందులో వైఎస్ఆర్ జిల్లా, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఆయా జిల్లాల్లో సామాజిక స్థాయిని(అభివృద్ధి)... ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అనంతరం జిల్లాలో చేపడుతున్న ప్రగతిపై పి పి టి ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డా.సచిన్ మిట్టల్ కు వివరించారు.ప్రతి మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరానికి ఒకసారి.. 6 అంశాలకు సంబంధించి.. కీ పారామీటర్ ఇండికేట్ (కెపిఐ) పాయింట్ల ఆధారంగా.. ప్రగతిని లెక్కించడం జరుగుతుందని తెలిపారు. అందులో.. ముఖ్యంగా హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్ నైపుణ్యాభివృద్ధి, గృహనిర్మాణం, వ్యవసాయం, పశుపోషణ, మౌలిక సదుపాయాలు ...మొదలైన శాఖల్లో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయడం జరుగుతోందని ఆయనకు వివరించారు. అలాగే జిల్లాలో పోస్టల్ శాఖ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సేవలను మెరుగ్గా ప్రజలకు అందజేస్తున్నామని తెలుపగా జిల్లా కలెక్టర్ ను అందుకు ఆయన అభినందించారు.అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక స్వావలంబన కార్యక్రమాల ద్వారా స్వయం సహాయక సంఘాలు లబ్ధి పొందుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. వ్యవసాయ అనుబంధ హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ వంటి రంగాల ద్వారా కూడా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. రాబోవు ఐదు సంవత్సరాలలో మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అందుకు అనుగుణంగా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామని వివరించారు.జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అందుకోసం.. సంబందిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సంతృప్త స్థాయిలో నిర్దేశిత లక్ష్యం మేరకు సాధించిన ప్రగతి ఆధారంగా.. ప్రోత్సాహకాలను కూడా భారీ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆ మేరకు.. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో డిఆర్డీఏ పిడి ఆనంద్ నాయక్, మెప్మా పీడీ కిరణ్ కుమార్ సిపిఓ హజ్రతయ్య, పరిశ్రమల శాఖ జి ఎం చాంద్బాషా,ఐసిడిఎస్ అధికారిని శ్రీలక్ష్మి,హార్టీ కల్చర్ డిడి సుభాషిని అనిమల్ హస్బండ్రీ జేడీ శారదమ్మ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు జనార్ధన్, పోస్టల్ అధికారులు ఎన్ ఆర్ భాష,తదితర అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## ఎంఎస్ఎంఈ ల సాధికారతతోనే దేశ సాధికారిక సాధ్యం..!

కడప మార్చి 6 ప్రభాతవార్త :

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ల సాధికారతతోనే దేశ సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కడపపులివెందుల రోడ్డులోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో యూనియన్ బ్యాంకు వారు ఏర్పాటు చేసిన "మెగా ఎంఎస్ఎంఈ ఔట్ రీచ్ క్యాంపు" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా.. వారితో పాటు యూనియన్ బ్యాంకు ఎంఎస్ఎంఈ జి.ఎం. జి.కె. సుధాకర్, కడప రీజినల్ మేనేజర్ లక్ష్మీ తులసి హాజరయ్యారు. ఈ సందర్భంగా.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. కడప యూనియన్ బ్యాంకు సంస్థ.. ఎంఎస్ఎంఈ ల కోసం ప్రత్యేక ఔట్ రీచ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో వ్యాపార, పెట్టుబడి ధోరణిలో.. పారిశ్రామిక రంగం వైపు అవగాహన పెంచడం అభినందనీయం అన్నారు. ఇప్పటి వరకు ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఏ బ్యాంకు కూడా నిర్వహించలేనిది.. యూనియన్ బ్యాంకు నిర్వహించడం గర్వించదగ్గ విషయం అన్నారు. మన రాష్ట్ర పెట్టుబడి మూలాలన్నీ యూనియన్ బ్యాంకులో నిక్షిప్తమై ఉన్నాయని ఈ సంస్థ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల నుండి కోట్లాది రూపాయల పెట్టుబడి లావాదేవీలు కొనసాగుతున్నాయన్నారు. దేశంలో 10 లక్షల నుండి 120 కోట్ల పెట్టుబడితో నిర్వహించే ప్రతి పరిశ్రమను సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల క్రింద చేర్చడం జగిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దేశం సర్వతో ముఖాభివృద్ధి చెందాలంటే భారీ పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈ ల పురోభివృద్ధి కూడా ఎంతో ముఖ్యం అన్నారు. పరిశ్రమలలో ఒక భాగంగా ఉన్న ఎంఎస్ఎంఈ విభాగాన్ని.. ఒక ప్రత్యేక పారిశ్రామిక రంగంగా ఒక పాలసీని తీసుకురావడం, అందుకు సంబంధించి "ఉద్యం" పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతోందన్నారు. ఒక వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరు ఉద్యం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని.. ప్రభిత్వం నుండి అందే అన్ని రకాల రాయితీలను పొందాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. దేశంలోనే మొట్టమొదటిగా స్వయం సహాయక సంఘాల వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందిపుచ్చుకుని.. ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా రాణించాలన్నారు. రాబోయో రోజుల్లో ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలి కుటుంబం.. ఒక నూతన పారిశ్రామిక వేత్తగా రాణించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు వేదికగా యూనియన్ బ్యాంకు ముందుకు వెళుతోందన్నారు. జిల్లాలో నలుమూలల వరకు బ్యాంకు సేవలను విస్తృతం చేస్తున్న యూనియన్ బ్యాంకు వారికి ధన్యవాదాలు తెలియజేసారు. ఎంఎస్ఎంఈ జి.ఎం. జి.కె. సుధాకర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ లబ్ధిదారులకు సెక్యూరిటీ లేకుండా సుమారు ఐదు కోట్ల రుణాలను అందించేందుకు యూనియన్ బ్యాంకు సంస్థ రుణాలను అందిస్తోందన్నారు. ముఖ్యంగా నారీశక్తి, యువశక్తి వంటి ఔట్ రీచ్ యాక్టివిటీ రుణాలను, చేనేత సంఘాలకు ముద్ర లోన్లు, అలాగే బీసీ వర్గాలకు పిఎం విశ్వకర్మ రుణాలను విస్తృతంగా అందిస్తున్న సంస్థ యూనియన్ బ్యాంకు మాత్రమే అని సగర్వంగా చెబుతున్నామన్నారు. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందుకుని ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా రాణించాలన్నారు. యూనియన్ బ్యాంకు కడప రీజనల్ మేనేజర్ లక్ష్మి తులసి మాట్లాడుతూ ప్రస్తుతం కడప రీజియన్ పరిధిలో 48 బ్రాంచులతో యూనియన్ బ్యాంకు బ్యాంకింగ్ సేవల్లో విస్తృతమైన సేవలు అందిస్తోందన్నారు. జిల్లాలో 551 మందికి 150 కోట్లకు పైగా నారీశక్తి పథకం ద్వారా రుణాలను అందివ్వడం జరిగిందన్నారు. కడప రీజియన్ పరిధిలో ప్రస్తుతం 600 కోట్లతో ఎమ్.ఎస్.ఎంఈ. లకు రుణాలను అందివ్వడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో 400 మంది ఎస్.హెచ్.జి. గ్రూపులకు మంజూరైన రూ.20 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 200 గ్రూపులకు చెందిన రూ.12 కోట్ల రుణాలకు సంబంధించి మెగా చెక్కులను, మహిళా సంఘ సభ్యులకు, అలాగే.. చేనేత సంఘాలకు మంజూరు చేసిన కోటి రువుఆయాలు, బీసీ కార్పోరేషన్ ద్వారా మంజూరైన రూ. 6.12 కోట్లను లబ్ధిదారులకు కూడా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. అలాగే ఉమెన్ ఎంపోవర్మెంట్ క్రింద పలువురు ఎంపిక చేసిన మహిళలకు ప్రోత్సాహక బహుమానాలు కూడా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ, మెప్మా, ఐసిడిఎస్ పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, శ్రీలక్ష్మి హ్యాండ్ లూమ్స్ ఏడీ పిచ్చేసేశ్వర రావు, బీసీ కార్పోరేషన్ ఈడీ జయసింహ, యూబీఐ అన్ని శాఖల బిఎం లు, బ్యాంకు ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## ఆర్థికంగా బలోపేతం కావాలి



**దువ్వూరు, మార్చి 06, ప్రభాతవార్త:**
సమాజంలోని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరళ అన్నారు. గురువారం మండల కేంద్రమైన దువ్వూరు అంగన్వాడి కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలచే సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు అవసరమైన విద్య మరియు జీవనోపాధి గురించి వివరించారు. మహిళలకు నిర్దిష్ట వడ్డీ రేట్లకు అందించే వివిధ ఆర్థిక సహాయ పథకాలను గురించి తెలిపారు. పొదుపు సంఘాల రుణాలు, వివిధ రకాల రుణాలు, స్త్రీ నిధి బ్యాంకు రుణాలు, గ్రామ సమాఖ్యల ద్వారా తీసుకునే రుణాల గురించి వివరిచారు. ఈ కార్యక్రమంలో మాబుచాన్, రూప తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఐ

**దువ్వూరు, మార్చి 06, ప్రభాతవార్త:**
బుధవారం రాత్రి దువ్వూరు సమీపంలో ఆనకట్ట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనను మైదుకూరు సీఐ శివశంకర్ పరిశీలించారు. ఈ ప్రమాద సంఘటనలో నరసింహులు, సుబ్బరాయుడులు అక్కడికక్కడే మరణించారు. వీరు వెళుతున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారా లేక ఇతర సంఘటనా ఏమైనా జరిగిందా అనే కోణంలో పరిశీలించారు. అలాగే రవాణాశాఖ అధికారులు, జాతీయ రహదారికి సంబంధించిన అధికారులు కూడ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏదిఏమైనా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించడంతో పెద్దజొన్నవరం గ్రామంలో విశాధఛాయలు అలుముకున్నాయి.

## హైవే రోడ్డు సమీపంలో చోరీ



**గోపవరం, మార్చి 6 (ప్రభాతవార్త) :**
పట్టణ పరిదిలో నెల్లూరు రోడ్డు మడకలవారిపల్లె ఎన్‌హెచ్67 రోడ్డు సమీపంలో ఓ ఇంట్లో పట్ట పగలే దొంగతనం జరిగినట్లు బాధితులు తెలిపారు. సదరు ఇంటి యజమాని శ్రీనివాసులు, ఆయన భార్య శివకుమారి తెలిపిన వివరాల మేరకు తాము పనిపై బయటకు వెళ్లిన సమయంలో ఇంటికి ఉన్న తాళాలు పగులకొట్టి 12 తులాల బంగారు, 4 లక్షలు నగదుతో పాటు, భూమికి సంబంధించిన పాసుపుస్తకాలు మరియు డీకేటి పేపర్లు చోరీకి గురయ్యాయని బాధితులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రూ.2కోట్లతో తారు రోడ్డుకు ప్రతిపాదనలు



**పెండ్లిమర్రి, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలంలోని పెండ్లిమర్రి నుంచి యాదమాపురం, కొత్తపల్లె, చెర్లోపల్లె వరకు అలాగే పులివెందుల ప్రధాన రహదారి నుంచి మిన్నయ్యగారిపల్లె నుంచి బాలిరెడ్డిగారిపల్లె వరకు తారు రోడ్డు వేసేందుకు రూ.2కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి డీఈ రాజగోపాల్‌రెడ్డి, ఏఈ దినేష్‌కుమార్‌రెడ్డిలు గురువారం రోడ్డును పరివీలించారు. ప్రతిపాదనలు అమలు అయిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లె సర్పంచ్ గంగిరెడ్డి, పెండ్లిమర్రి సర్పంచ్ నాగమల్లారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ



**కలికిరి, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో భానుమూర్తిరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి సంబంధించిన హాజరుపట్టికను పంచాయతీ రికార్డులను ఎంపీడీవో తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా పలకరించి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని ఎంపీడీవో సచివాలయ సిబ్బందికి సూచించారు. పంచాయతీలలో వర్క్ ఫ్రం హోం సర్వేని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సమన్వయంతో చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవాజ్, సచివాలయ పంచాయతీ కార్యదర్శి జనీఫారాణి, హార్టికల్చర్ అసిస్టెంట్ రోషన్ ఆరా, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డి మాటలు హాస్యాస్పదం



**సిద్దవటం, మార్చి 6, ప్రభాతవార్త:**
మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురించి అందరికీ తెలుసు కాబట్టే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు. 2029 ఎన్నికల్లో కూడా తన సీటు తను గెలుస్తానో లేదో అనే అయోమయంలో జగన్ ఉన్నాడని రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ విమర్శించారు. తన పార్టీ ఏమైపోతుందో దిక్కుతోచని స్థితిలో పార్టీ మనుగడ కోసం పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తున్నారన్నారు. తను ఎంత అరటి గీ పెట్టినా తమ పార్టీ కార్యకర్తలే జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఓర్వలేక జగన్ హాస్యాస్పద విమర్శలు చేస్తున్నాడన్నారు. పవన్ కల్యాణ్ శక్తి ఏమిటో దేశమంతటా తెలుసునని ఆయన నిబద్ధత మంచితనం ప్రజలకు తెలుసని అందుకే వంద శాతం విజయాన్ని అందించి డిప్యూటీ సీఎం హోదాలో ప్రభుత్వం కూర్చోబెట్టిందని తెలిపారు.

## గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల



**సిద్దవటం, మార్చి 6, ప్రభాతవార్త:**
గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీఏ కె.లక్ష్మీదేవి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం పశువైద్య కేంద్రంలో గురువారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు తీవ్రమైన జ్వరం మరియు నీరసం, నోటి నుంచి తీగల మాదిరి చొంగ, నోరఉ మరియు కాలి గిట్టల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా గొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయన్నారు. వ్యాధి వలన పశువుల్లో పాల ఉత్పత్తి మరియు పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. తద్వారా రైతుకు ఆర్థిక నష్టం సంభవిస్తుందన్నారు. పాలు తాగే దూడలలో మరణాలు సంభవిస్తాయన్నారు. వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవడం జరుగుతుందన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి టీకాల వలన కలిగే లాభాలు వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చన్నారు. వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా అరికట్టవచ్చన్నారు. దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా 4 నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. గాలికుంటు టీకాలు వేయిస్తే పశు మరణాలు అరికట్టవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ జిలానీ బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా జగన్ తీరు మారలేదు

### జనసేన సమన్వయకర్త శ్రీనివాసరాజు

**రాజంపేట అర్బన్, మార్చి 6 ప్రభాతవా ర్త**
రాష్ట్ర ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా తీర్పు ఇచ్చినా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి తీరు మారలేదని జనసేన పార్టీ సమన్వయకర్త ఎల్లటూరి శ్రీనివాసరాజు విమర్శించారు.జనసేనపార్టీ అధినేత , ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ని నోటికొచ్చినట్టు మాట్లాడిన జగన్ రెడ్డి తీరు చూస్తే మానసిక పరిస్థితి బాగోలేదనిపిస్తోందని అన్నారు. జనసేనపార్టీ పోటీచేసిన ప్రతిచోట గెలిపించి వంద శాతం స్ట్రైక్ రేట్ వున్న నాయకులు పవన్ కళ్యాణ్ అని గుర్తు చేశారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు అడ్డదిడ్డంగా ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి దోచుకున్న డబ్బుతో అహంకారం గర్వం ఇంకా తగ్గలేదన్నారు. ఎన్నికలలో ప్రచారం చేసేటప్పుడు పవన్ కళ్యాణ్ బహిరంగంగా జగన్ను అధఃపాతాలానికి తొక్కకపోతే నాపేరు పవన్ కళ్యాణ్ కాదని చెప్పి నేడు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారనీ పేర్కొన్నారు. జగన్ చర్లపల్లి జైలుకి ఎక్కువ తీహార్ జైలుకి తక్కువ అని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో వైసీపీ అధినేత తీరు మారకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని యల్లటూరు శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలి



**బద్వేలు ,మార్చి 6, ప్రభాతవార్త ;**
పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ పేరుతో దగ్గరిలోని 5 కిలోమీటర్ల పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విలీనం చేయడం తగదని డెమొక్రటిక్ పిఆర్టియు జిల్లా అధ్యక్షులు రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు .గతంలో ప్రభుత్వం ప్రతి పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూల్ గా మార్పు చేస్తామని తెలిపారు .కానీ ప్రస్తుతం దానికి విరుద్ధంగా ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా మారుస్తూ 3,4,5 తరగతులను దూర ప్రాంతాల్లో గల మోడల్ ప్రైమరీ స్కూలుకు తరలించడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు .ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూలుకు తరలించడం వలన ప్రవేట్ విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందే గాని ,ప్రభుత్వ బడులు పటిష్టం కావని తెలిపారు .కావున ప్రతి పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూల్ గా మార్పు చేసి అవసరమైన చోట మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే షీట్స్ ఓపెన్ చేస్తాం

**సిద్దవటం, మార్చి 6, ప్రభాతవార్త:**
ఇసుక అక్రమ రవాణా చేస్తే వాహనదారులపై షీట్స్ ఓపెన్ చేస్తామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్దవటం స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వాహనాలను మైన్స్, ఆర్డీవోలకు పంపడంతో పాటు షీట్స్ ఓపెన్ చేస్తామన్నారు. భాకరాపేటలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. వేసవి కాలంలో బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు విలువైన బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్‌లో పెట్టుకోవాలన్నారు. బయటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాలు జరగకుండా ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ టి.బాబు, ఇన్‌ఛార్జి శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

## తండ్రిపై బండరాయితో దాడి చేసిన తనయుడు

**సిద్దవటం, మార్చి 6, ప్రభాతవార్త:**
తండ్రిపై తనయుడే బండరాయితో దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఖాదర్ హుసేన్ సొంత గృహం అద్దెకు ఇవ్వడానికి ఇంటికి సూచిక బోర్డు ఏర్పాటు చేయగా తన కుమారుడు బాబాఫక్రుద్దీన్ సూచిక బోర్డు తొలగించి తండ్రిపై బుధవారం సాయంత్రం తన ఇంటి వద్ద బలమైన బండతో కొట్టడంతో తలకు బలమైన గాయాలు తగిలి కుప్పకూలిపోయాడు. స్థానికులు, బంధువులు కలిసి ప్రథమ చికిత్స కోసం దాడిలో గాయపడిన వ్యక్తిని ఒంటిమిట్ట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి తలకు బలమైన గాయాలు తగలడంతో తలకు మూడు కుట్లు వేసి మెరుగైన వైద్య సేవలు కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా దాడిలో గాయపడ్డ ఖాదర్ హుసేన్ మాట్లాడుతూ ఆస్తి కోసం కన్న తండ్రిపైనే నా కుమారుడు దాడి చేయడం చాలా అన్యాయమని విచారించి న్యాయం చేయాలని ఆయన తెలిపారు. ఈ విషయమై స్థానిక మండల ఇన్‌ఛార్జి ఎస్సై శివప్రసాద్‌ను వివరణ కోరగ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

## కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైళ్లు విజిట్

**కడప లీగల్, మార్చి 6, ప్రభాతవార్త:**
ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైళ్లు గురువారం విజిట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను పరిశీలించి అనంతరం ప్రసంగిస్తూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలిపారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెం బర్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే కమలాపురం మండల న్యాయ సమితిని, జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని, ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కడపను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైలు సూపరింటెండెంట్లు, ప్యానల్ న్యావా దులు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జమ్మలమడుగు కోర్టు నందు న్యాయవాదులతో ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈనెల 8న జరగనున్న జాతీయ లోక్ అదా లత్ నందు ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని న్యాయ వాదులను కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితి ఛైర్మన్ కం జూనియర్ సివిల్ జడ్జీ శ్రీమతి ఎస్.భార్గవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరు

**సిద్దవటం, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలంలోని దేగనవారిపల్లె లింగంపల్లి, మాచుపల్లి తదితర పెన్నా పరివాహ ప్రాంతాల గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల ద్వారా జిల్లా కేంద్రానికి రవాణా చేస్తూ వేల రూపాయలు సంపాదిస్తు ప్రభుత్వ ఖజానా గండి కొడుతున్న అక్రమ ఇసుక రవాణా అధిక లోడుతో గోతులు పెట్టి తవ్వకాలు జరుపుతున్నారని దీని ప్రభావం వల్ల పెన్నా నదిలో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంట పొలాలు దెబ్బతిని పోతాయని రైతుల గోడు విని అక్రమ ఇసుక రవాణా జరగకుండా అరికట్టాలని రైతులు కోరుతున్నారు. అక్రమ ఇసుక రవాణాపై ఇన్‌ఛార్జి మండల తహసీల్దార్ మాధవీలతను వివరణ కోరగా అక్రమ ఇసుక రవాణా జరిగే పెన్నానది పరివాహక ప్రాంతాలలో జేసీబీ యంత్రాలతో రహదారిని తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆమె అన్నారు.

## జనసేన ఆవిర్భావ సభ పోస్టర్ ఆవిష్కరణ



**జమ్మలమడుగు, మార్చి 6, ప్రభాతవార్త:**
ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు తరలిరావాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక పలగాడి మోటు వద్ద గల గౌసియా షాదీఖానా ఫంక్షన్ హాలులో జనసేన పార్టీ ప్లీనరీని జమ్మలమడుగు జనసేన కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన తాతం శెట్టి నాగేంద్ర మాట్లాడుతూ పిఠాపురం వైపు అడుగులు వేయాలని జమ్మలమడుగు ప్రజలను అడుగుతున్నామన్నారు. అధికారంలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా జనసేన పార్టీ ఉంటుందన్నారు. అనంతరం నల్లంశెట్టి నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర మరియు దేశ రాజకీయ నాయకులలో మచ్చలేని వ్యక్తి పవన్ కల్యాణ్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పవన్ కల్యాణ్ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. అనంతరం తుంగ రమణయ్య, రంజిత్‌కుమార్, జీవీ రమణ, గురుకుమార్, పవన్‌కుమార్‌లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కాటమ, వినయ్, కిరణ్, సుబ్బు, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహ, శివకృష్ణ, జగదీష్, మైలవరం, పెద్దముడియం మండల జనసేన అధ్యక్షులు, వీర మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూ పోరాటాలకు సిద్ధం కండి.




**బద్వేల్ అర్బన్ మార్చి 06 ప్రభాతవార్త,:**
బద్వేలు స్థానిక ఎన్జీ హోమ్ నందు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం బద్వేలు పట్టణ కార్యదర్శి కే.శ్రీను అధ్యక్షతన సిపిఎం బద్వేల్ నియోజకవర్గంలోని 7మండలాల మరియు బ్రహ్మంగారిమఠం మండల "భూపాధితుల వలసల నివారణ" అనే అంశంపై "సదస్సు" జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మార్చి 15వ తేదీ నుండి నియోజకవర్గంలోని 15 గ్రామాల్లో, బ్రహ్మంగారిమఠం మండలంలోని 5 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములకు, స్థానిక గ్రామాలలోని భూమిలేని నిరుపేదలు భూ దరఖాస్తులు పెట్టించడం జరుగుతుందని, భూమిలో ఎర్రజెండాలు నాటి భూమి దున్ని చదును చేస్తారని, ప్రభుత్వాలు, పాలకులు, ఉద్యోగులు గ్రామీణ నిరుపేదల భూ దరఖాస్తులను పరిశీలించి, వారికి డీకేటి పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం కార్యకర్తలు నాయకులు గ్రామాల్లో పేద వర్గాల క్షేత్రస్థాయి సమస్యలను అధ్యయనం చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో "పేదల ఐక్య వేదిక" లు ఏర్పాటు చేసి "సామాజిక న్యాయం కోసం" పోరాటాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. పేదల గుడిసెల జోలికి వస్తే ప్రభుత్వాలపై ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్ బాషా, సిపిఎం బద్వేల్ రూరల్ మండల కార్యదర్శి జి.వెంకటేష్, అట్లూరు మండల కార్యదర్శి ఈ.రమణయ్య, బ్రహ్మంగారిమఠం మండల కార్యదర్శి జి.సునీల్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎన్.వీరయ్య, ఎస్ గురయ్యా, నరసింహులు, ఆర్ ఓబయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, బద్వేల్ నియోజకవర్గం లోని ఏడు మండలాల భూపాధితులు, వలస కార్మికులు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంజనేయనగర్‌లో విద్యుత్ దీపాలకు మరమ్మతులు







**బద్వేలు అర్బన్, మార్చి 6, ప్రభాతవార్త :**
మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయనగర్‌లో గత కొద్ది రోజుల నుంచి విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు అంకిరెడ్డి శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ , సీనియర్ న్యాయవాది పీవీఎన్ .ప్రసాద్ సహకారంతోమున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి దృష్టికి తీసుకుపోయి విద్యుత్ లైట్లు వెలిగేలా మరమ్మతులు చేపట్టి వీధిలో విద్యుత్ దీపాలు వెలిగేలా కృషిచేయడం జరిగిందని శేఖర్‌రెడ్డి తెలిపారు. అలాగే వార్డు కొత్త కరెంటు స్తంబాలకు 10 వీధిలైట్ల క్లాంపులు వేయించడం జరిగిందని తెలిపారు. అలాగేవార్డులో ట్రాన్స్‌ఫార్మర్ మరియు మున్సిపాలిటీ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను కూడా మున్సిపల్ సిబ్బంది ద్వారా తొలగించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వార్డులో అవసరమైన సౌకర్యాలను యువనేత రితేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సహకారంతో ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు

## టెన్త్ విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోండి

**తంబళ్లపల్లె మార్చి 6 ప్రభాతవార్త ః**
2025 ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్ల సౌకర్యార్థం సంబంధిత హెడ్మాస్టర్ల లాగిన్‌లో సోమవారం నుండి అందుబాటులో ఉంటాయని ఎంఈఓ త్యాగరాజు తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.వి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్ల ను వాట్సాప్‌మనమిత్ర ద్వారా విద్యార్థులు నేరుగా డౌన్లోడ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. అభ్యర్థులు వారి వాట్సాప్ ద్వారా 9552300009కి హాయ్ సందేశం పంపి తమ సేవను ఎంచుకొని క్లిక్ చేసి విద్యా సేవలు ఎంచుకొని ఎస్ఎస్సి హాల్ టికెట్ను ఎంచుకోవాలన్నారు. అనంతరం అప్లికేషన్ నెంబరు, చైల్డ్ ఐడి, పుట్టిన తేదీ నమోదు చేసి స్ట్రీమ్ ను ఎంచుకొని మీ వాట్సాప్ నెంబర్‌లో మీ హాల్ టికెట్‌ను స్వీకరించడానికి కన్ఫామ్‌పై క్లిక్ చేయాలన్నారు. ఈ వివరాలపై సంబంధిత ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల హాల్ టికెట్ల పూర్తి వివరాలు సరి చూసి ఎలాంటి లోపాలున్న వెంటనే ఈమెయిల్ ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.వి శ్రీనివాసులు రెడ్డి గారి దృష్టికి తీసుకు వెళ్లాల్సి ఉందన్నారు.

## విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిన హెచ్‌ఎం




**రామసముద్రం మార్చి6 ప్రభాతవార్త**
మండల కేంద్రంలో జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం మరియు పాఠశాల వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాఠశాల వార్షికోత్సవం కావడంతో విద్యార్థులు సంప్రదాయమైన దుస్తులతో పాఠశాల పచ్చని తోరణాలతో కళకళలాడింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యార్థులు మెలగాలని మంచి నడవడికతో నడవాలని గురువులకు, తల్లి దండ్రులకు, గ్రామప్రజలకు మండలానికి మీరు బాగా చదివి పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు.పదవ తరగతి ఫలితాలలో మంచి ఫలితాలు సాధించి జిల్లాలోని మొదటి స్థానంలో పాఠశాలలు నిలవాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.విద్యార్థులు పాఠశాలలో ఐదు సంవత్సరాల నుంచి చదివి పాఠశాలను వీడుతున్నందుకు జూనియర్స్ విద్యార్థులు వీడుకోలు పలికారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం చిట్టి బాబు ఎస్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి ఎంఈవో హేమలత, ఎం ఈ వో 2ఆంజనేయులు,మండలఎస్ టి యు అధ్యక్షులు అయూబ్, పీడీ చంద్ర నారాయణస్వామి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ జోలికి వస్తే తగిన గుణపాఠం



కూటమి నాయకులతో ఎద్దుల నరసింహులు.

**తంబళ్లపల్లె మార్చి 6 ప్రభాతవార్త ః**
దేశంలోనే 100 ఫలితాలతో రికార్డు సృష్టించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జోలికి వస్తే భవిష్యత్తులో వైకాపాకు కూటమితో తగిన గుణపాఠం చెప్తామని మండల జనసేన పార్టీ నాయకుడు ఎద్దుల నరసింహులు విమర్శించారు. గురువారం ఆయన కూటమి నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని తాకట్టు పెట్టే స్థాయికి చేర్చిన నీవా నీతి వాక్యాలు మాట్లాడేది రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి నాయకులు చేస్తున్న కృషికి నిన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఘన విజయమే నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో వైకాపా అడ్రస్సు గల్లంతు ఖాయమని కూటమి పాలనలో ఆంధ్ర రాష్ట్రం స్వర్ణాంధ్రగా దేశంలోనే అగ్రగామిగా నిలిచేంతవరకు ఏ దుష్టశక్తి ఆపలేదని ధీమా వ్యక్తం చేశారు. చేతనైతే చేసిన తప్పుకు లెంపలేసుకుని ప్రజాసేవ చేయాలని కూటమి జోలి కొస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. ఆయన వెంట జనసేన, తెలుగుదేశం కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

**పీలేరు మార్చి 6 ప్రభాతవార్త :**
పీలేరు కోర్టు ఆవరణంలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించు చున్నట్లు పీలేరు ఇంచార్జ్ 11వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ పీలేరు కోర్టు సముదాయంలో రెండు బెంచ్ లను నిర్వహించడం జరిగింది. మొదటి బెంచ్ లో మోటార్ వాహన కేసులు, బ్యాంక్ కేసులు, బిఎస్ఎన్ఎల్ కేసులు, ఫ్రీ లిటిగేషన్ కేసులు నిర్వహించడం జరుగుతుంది. ఈ బెంచ్ లో డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు గారు తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జిగారు నిర్వహిస్తారు. రెండవ బెంచ్ లో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాల కేసులు, ఎన్ఐ యాక్ట్ కేసులు మొదలైన కేసులు నిర్వహించడం జరుగుతుంది. ఈ పెంచులు శ్రీ కె రవి, సీనియర్ సివిల్ జడ్జిగారు నిర్వహిస్తారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాదులు కక్షిదారులు బ్యాంక్ అధికారులు ప్రతి ఒక్కరూ ఈ జాతీయ లోక్ అదాలత్ సహకరించాలని ప్రతి ఒక్కరికి తెలియజేశారు. కోర్టుకు కక్షిదారులు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు జిరాక్స్ , పాస్ పోర్ట్ ఫోటో తీసుకొని రావాలని తెలియజేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**పీలేరు మార్చి 6 ప్రభాతవార్త :**
సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి అని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి గారికి విన్న విస్తున్న ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ మరియు జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు ఇమ్రాన్,బాలాజీ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారం

**కలికిరి, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ కడియవాండ్లపల్లె గ్రామంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ముజీబర్ రెహమాన్ లైన్‌మెన్ గోపీ చొరవతో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డి రామ్ మంచినీటి సమస్యను పరిష్కరించారు. గ్రామంలో మంచినీటి బోరు సరఫరాకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తింది. వెంటనే స్థానిక సర్పంచ్ రెడ్డిరామ్ స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దృష్టికి తీసుకెళ్లి ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేయడం జరిగింది. ట్రాన్స్‌కో ఏఈ దృష్టికి తీసుకెళ్లి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారం అయ్యింది. దీంతో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.



## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 6 ప్రభాతవార్త :**

ఆటో కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. గురువారం సంతగేటులోని ఏఐటియుసి కార్యాలయంలో ఆటోడ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం రెడ్డెప్ప అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు భారీగా చలానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఓనెంబర్ 21, 31లను రద్దు చేయాలన్నారు. డీజల్,పెట్రోల్ థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ 30శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటోల మీద ఉన్న పోలీస్ ఈ చలానాలు రద్దు చేయాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆటో స్టాండ్ల కొరకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఆటో డ్రైవర్లు ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని వీరికి ప్రత్యామ్నాయ సౌకర్యం కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు సలీంబాషా, వద్రి సురేష్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, ముబారక్, తిరుమల, మస్తాన్, శంకర, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీపీలో కాంట్రాక్ట్ కార్మికుడు గుండెపోటుతో మృతి

**యర్రగుంట్ల మార్చి 06 ప్రభాతవార్త**

మండల పరిధిలోని డాక్టర్ ఎమ్‌వీఆర్ ఆర్టిపిపి నందు కాంట్రాక్ట్ కార్మికుడిగా పాత కోల్ ప్లాంట్ నందు మెకానిక్ గా పనిచేస్తున్న నాగరాజు(40) గురువారం మృతి చెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే మృతి చెందాడంటూ ఆర్టిపిపి గేటు వద్ద మృతదేహంతో బంధువులు భార్య ధర్నా నిర్వహించారు. మృతుడు భార్యకు 29 బేసిక్ మీద 22,000 జీతంతో ఉద్యోగం ఇవ్వాలంటూ డిమాండ్ చేసిన బంధువులు.మృతుడు తాడిపత్రికి చెందిన వ్యక్తి ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు.గతంలో మూడు నెలల క్రితం నాగార్జున కంపెనీలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుడికి 15 లక్షల రూపాయలు కంపెనీ యాజమాన్యం ప్రకటించిన నిజం గాని 15 లక్షల రూపాయలు ఏపీ జెన్కో యాజమాన్యం ఇస్తూ మరియు గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని ఏఐటియు యూనియన్ ఆర్టిపిపి రీజినల్ కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు

## పన్నులు 100 శాతం వసూలు చేయాలి



**పులివెందుల రూరల్, మార్చి 06, ప్రభాతవార్త :**

పులివెందుల మునిసిపాలిటి పరిధిలో పన్నులు 100 శాతం వసూలు చేయాలని కమీషనరు డి.రాముడు సూచించారు. డి.ఎమ్.ఎ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ డి రాముడు, మున్సిపల్ ఇంజినీర్ చిదానంద రెడ్డి, మున్సిపల్ రెవెన్యూ అధికారి మునికుమార్ తో కలిసి గురువారం పురపాలక సంఘం పరిధిలోని 18 వార్డు సచివాలయం కార్యదర్శులతో ఆస్తిపన్ను, నీటి పన్ను వంద శాతం వసూళ్ల చేయు విషయమై సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయం సిబ్బంది ప్రతి ఒక్కరూ ఆయా సచివాలయం నోడల్ అధికారి తో కలసి ఉదయం 8.00 గంటల నుండి 11.00 గంటల వరకు, సాయంత్రం 3.00 నుండి 5.00 గంటల వరకు ఆస్తిపన్ను, నీటిపన్ను వసూళ్లకు తప్పక హాజరై వంద శాతం పన్ను వసూళ్లకు కష్టపడాలని సూచించారు. ఇప్పటికే అధిక శాతం వసూలు చేసిన ఎస్ బీఐ, , అంకాలమ్మ పేట సచివాలయం కార్యదర్శులను ఆయన సన్మానించారు.

## చంటి కుటుంబానికి ఆర్థిక సహాయం



**మైదుకూరు, మార్చి06, ప్రభాతవార్త:**

మున్సిపాలిటీ బద్వేల్ రోడ్డు రహదారిలో ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ లో చనిపోయిన యర్రబల్లి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ కంచెర్ల.చంటి కుటుంబానికి 1,33,200 రూపాయలు ఆర్థిక సహాయం. అతనికి ఇద్దరు కుమార్తెలు, పూజిత (7), ప్రణవి (4) వీరు పుట్టుకతోనే బుద్ధి మాంద్యం, అవయవాలు పురోగతి లేకుండా ఉన్నారు. వారి కుటుంబం కోసం మైదుకూరు మరియు ప్రొద్దుటూరు ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ తరపున ఆర్థిక సహాయం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మైదుకూరు మరియు ప్రొద్దుటూరు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రజలకు మినరల్ వాటర్ అందించాలి

### శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

**పీలేరు మార్చి 6 ప్రభాతవార్త :**



కిషోర్ కుమార్ రెడ్డి

వైసీపీ ప్రభుత్వంలో మినరల్ గ్రాంట్స్ పేరుతో ఎంపీ లాండ్స్ కింద ప్రజలకు సౌకర్యంగా త్రాగునీరు అందించడానికి రాష్ట్రవ్యాప్తంగా వాటర్ ఫ్లాంట్స్ అమలు చేశారని, దానికి సంబంధించి మరమ్మతులు చేయటం, వాటికి మెయింటి నెన్స్ చేసే పరిస్థితి లేదని అక్కడ పనిచేసే వాటర్‌మేన్‌లకు కనీసం వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సంబంధిత మంత్రులకు అసెంబ్లీలో విన్నవించారు. అందులో భాగంగా పీలేరు పట్టణంలో కూడా 23 వాటర్ ప్లాంట్ లు ఉన్నాయని ప్రస్తుతం ఈ ప్లాంట్స్ లో పని చేస్తున్న సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు లేవని ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీ అధికారులకు బాధ్యతలు ఇచ్చి వారికి వేతనాలు ఇవ్వాలని సంబంధిత శాఖ మంత్రి వర్గాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఇదే పరిస్థితి నెలకొందని, ప్రజలకు సౌకర్యంగా త్రాగునీరు అందించడానికి బాధ్యతలు పంచాయతీ శాఖకు అప్పజెప్పాలని అలాగే వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీరుకు ఇబ్బంది పడతారని అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరైన సమయానికి త్రాగునీరు అందించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. దాంతో స్పందించిన మంత్రి వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి దీని మీద తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విలీనం చేయాలన్న ప్రతిపాధన విరామించుకోవాలి

**రామసముద్రం మార్చి 6 ప్రభాతవార్త**



మండలంలోని కురిజల గ్రామంలో ఉన్న ఎంపియుపి పాఠశాలను జడ్పీ హైస్కూల్లో విలీనం చేయాలన్న ప్రతిపాదనను విరమించుకోవాలని గ్రామస్థులు ఎంఈవో హేమలత, హెచ్ఎం చిట్టిబాబుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రామసముద్రం జడ్పీ హైస్కూల్‌కు 6,7 తరగతి పిల్లలు రావాలంటే దాదాపు ఆరు కిలోమీటర్లు ఉంటుందని, బస్సు సౌకర్యం లేదన్నారు. దీంతో స్కూల్లో 33 మందిని విద్యార్థులు ఉన్నారని జడ్పీ హైస్కూల్లో విలీనం చేయకుండా తమ గ్రామంలోనే కొనసాగించాలన్నారు.

## డంపింగ్ యార్డులు బృందావనాలుగా మారాలి



డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న టిఎల్పిఒ

**తంబళ్లపల్లె మార్చి6 ప్రభాతవార్త ః**

మండలంలోని డంపింగ్ యార్డులు (చెత్త సేకరణ కేంద్రాలు) మార్చిలోగా ఆకర్షణీయమైన బృందావనాలుగా తయారు చేయాలని డిఎల్‌పిఒ నాగరాజు కార్యదర్శిలను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని కుక్క రాజుపల్లి, కన్నెమడుగు, కోటకొండ, తంబళ్లపల్లె డంపింగ్ యార్డులను తనిఖీ చేశారు. పలుచోట్ల చెత్త సేకరణ తో పాటు డంపింగ్ యార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి, ఈఓఆర్డి దిలీప్ కుమార్ నాయక్ లతో కలిసి కార్యదర్శుల సమీక్షలో పాల్గొన్నారు. ప్రతి గ్రామం నుండి చెత్త సేకరణ జరగి డంపింగ్ ఎరువుగా మార్చాలని, యార్డులో పరిశుభ్రతతో పాటు మొక్కలు పెంచి వాటిని నిజమైన బృందావనాలుగా తీర్చిదిద్దాలన్నారు. పంచాయతీలలో ఇంటి పన్ను వసూళ్లతో పాటు ఆదాయ వనరులను గుర్తించి గ్రామాలలోని వీధిలైట్లు, గ్రీన్ అంబాసిడర్ల జీతాలు, మౌలిక సదుపాయాల పై దృష్టి సాధించాలన్నారు. పన్ను, ఆదాయ వనరుల సేకరణలో తంబళ్లపల్లె కార్యదర్శి రామకృష్ణ పనితీరును ఆయన ప్రశంసించారు. పంచాయతీకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలో గాలికుంటి టీకాలు

**రామసముద్రం మార్చి6 ప్రభాతవార్త**



మండలం లోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీలో గాలికుంటి టీకాలు పశువైద్యాధికారులు నిర్వహించారు. రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక డీడీ సత్యనారాయణ తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం అమలులో భాగంగా మండలంలోని పెద్దకురుపల్లి పంచాయతీలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు రావడం, 104 జ్వరం ఉండడం గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలో ఏడి రోహిణి డాక్టర్ దివ్య, అజయ్, ఏహెచ్ ఏ నాగభూషణ్ వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు చాలెంజ్ పోటీలు

**కురబలకోట, మార్చి 6 ప్రభాతవార్త**



మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, మదనపల్లె కళాశాల నందు టెక్ క్లబ్ వారు కళాశాలలోని విద్యార్థులకు టెక్ ఇంటెలెక్ట్ ఛాలెంజ్ పోటీలను నిర్వహించినారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సాంకేతిక మరియు విశ్లేషణాత్మక నైపుణ్యాలను పరీక్షించడానికి మరియు పెంచడానికి ఉపయోగపడుతుంది. ఈ పోటీలు మూడు దశలు నిర్వహించగా, ప్రతి ఒక్కటి సమస్యపరిష్కారం, డీబగ్గింగ్ మరియు కోడింగ్ నైపుణ్యం యొక్క విభిన్న అంశాలను అంచనా వేయడానికి రూపొందించబడింది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి యువరాజ్ అన్నారు. మొదటి దశలో ఐకాన్ శ్రీ, లాజికల్ రీజనింగ్, సాంకేతిక పరిజ్ఞానం మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలపై దృష్టి సారించడం, చిక్కులను పరిష్కరించడం మరియు సాంకేతిక సంబంధిత ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా వారి విశ్లేషణాత్మక సామర్థ్యాలను ప్రదర్శించారు. రెండవ దశలో పాల్గొనేవారు తప్పు కోడ్‌ను పరిష్కరించడం మరియు తార్కిక లోపాలను గుర్తించడం వంటివి చేయబడ్డారు. ఈ ఛాలెంజ్ సమయ పరిమితిలోపు లోపాలను సమర్థవంతంగా విశ్లేషించడం, గుర్తించడం మరియు సరిదిద్దడంలో పాల్గొనేవారి సామర్థ్యాన్ని పరీక్షించుకోవచ్చు. మూడవ దశలో కోడ్ క్లాష్, మూడు క్లిష్టమైన ప్రోగ్రామింగ్ సమస్యలను కలిగి ఉన్న కోడింగ్ ఛాలెంజ్. ఈ రౌండ్ లో పాల్గొనేవారి అల్గారిథమిక్ ఆలోచన, కోడింగ్ నైపుణ్యం మరియు సమయ పరిమితులలో సమస్య పరిష్కార సామర్థ్యాన్ని ప్రదర్శించిన వారు విజేతలుగా నిలిచారు అని ఆయన అన్నారు. కార్యకమం లో టెక్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ యెన్. మగేష్ కుమార్, స్టూడెంట్ ప్లేసెమెంట్ కో ఆర్డినేటర్ డి గీతిక తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా ఎల్లంపల్లి ప్రశాంత్

**మదనపల్లె, మార్చి 6 ప్రభాతవార్త :**



పత్రం అందుకొంటున్న దృశ్యం

అన్నమయ్య జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎల్లంపల్లి ప్రశాంత్‌ను నియామకం చేశారు. ఈ మేరకు గురువారం ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు టిజె.వెంకటేష్ ఆయనకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి ప్రశాంత్ మాట్లాడుతూ తనకు జిల్లా పదవి రావడం పట్ల మరింత భాద్యతను పెంచిందన్నారు. జిల్లా అంతా పర్యటించి ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి పెద్దల దృష్టికి తీసుకెలుతానన్నారు. ఆర్యవైశ్యలందరికి అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం ఆయన తనకు పదవి రావడానికి కృషి చేసిన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య, చిన్నరామ సత్యనారాయణ, నరసింహులుశెట్టి, వేణుగోపాల్, ఓంప్రకాష్‌లకు అభినందనలు తెలిపారు.

## కురవంక సర్పంచ్‌కు మాతృవియోగం

**మదనపల్లె, మార్చి 6 ప్రభాతవార్త :**



నివాలకుర్పిస్తున్న దృశ్యం

రూరల్ మండలంలోని కురవంక గ్రామ సర్పంచ్ పసుపులేటి చలపతికి మాతృవియోగం కలిగింది. సర్పంచ్ తల్లి పసుపులేటి చెన్నమ్మ(95) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె పార్థీవదేహాన్ని మదనపల్లె డివిజన్‌లోని వివిధ రాజకీయ పార్టీ నాయకులతో పాటు. వివిధశాఖ అధికారులు, ప్రజాప్రతినిదులు సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, మల్లయ్యకొండ మాజీ ఛైర్మెన్ కొనుగొండ మద్దిరెడ్డి, విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, కొవైట్ మాధవరెడ్డి, బోర్‌వెల్ సుధాకర్, మిద్దింటి కిశోర్, బోయపాటి మురళి, నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## భార్యపై భర్త గొడ్డలితో దాడి

**చాపాడు. మార్చి 6. ప్రభాతవార్త.**



మండలంలోని ఎన్ఓబాయపల్లి గ్రామపంచాయతీ కొత్త కొట్టాల కాలనీలో గురువారం భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే ఎర్రిబోయిన భాస్కర్, కళావతి దంపతులు, కళావతి ఇంటిలో పడుకుని ఉండగా భర్త భాస్కర్ గొడ్డలితో దాడికి తెగబడడంతో పలుచోట్ల తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం పొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ భవాని తెలిపారు.

## శ్రీ వీరభద్ర స్వామి శాశ్వత హుండీల లెక్కింపు



**చాపాడు. మార్చి 6. ప్రభాతవార్త.**

అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణము నందు ఆలయ కార్య నిర్వహణ అధికారి.కే. శ్రీనివాసులు పర్యవేక్షణలో గురువారం శాశ్వత హుండీల లెక్కింపు నిర్వహించారు. ఇందులో శాశ్వత హుండీల ద్వారా9,25,769 రూపాయలు, వీరభద్ర స్వామిఅన్న సత్రం ద్వారా 58,717, రూపాయలు ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్,తహసీల్దార్ రమా కుమారి, ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు వీరనారాయణ యాదవ్, మాజీ జెడ్పిటిసి మేకల బాబు, గుత్తి వీరనారాయణ యాదవ్ గోవిందమాల సేవా కర్తలు, మైదుకూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది, అర్చకులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మఒడికి అనాధ వృధారాలు

**మదనపల్లి క్రైమ్, మార్చి 6 ప్రభాతవార్త.**



గత కొన్ని రోజులుగా ఆప్తులు లేక రోడ్డుపై పడి ఉన్న ఓ వృద్ధురాలను చిత్తూరు అమ్మ ఒడి అక్కున చేర్చుకుంది. పట్టణ శివారులో మతిస్థిమితం లేని 70 ఏళ్ల వృద్ధురాలు గత కొన్ని రోజులుగా తిండి లేక రోడ్డుపైనే ఉండటం గమనించిన ఉష, రేణుక అలియాస్ చిట్టి విషయాన్ని చిత్తూరు అమ్మ ఒడి తెలిపింది. దీంతో అమ్మబడి వ్యవస్థాపకులు పద్మనాభ నాయుడు గురువారం మదనపల్లికి చేరుకొని మతిస్థిమితం వృధాలను చిత్తూరు అమ్మ ఒడికి తీసుకెళ్లారు. రోడ్డుపై ఆర్తనాధాలతో తిండి గడుపుతున్న వృద్ధురాలని అమ్మ ఒడి అక్కున చేర్చుకోవడంపై పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, లావణ్య, పూర్ణిమ, ప్రకాష్, హుస్సేన్, ఉదయ్ కుమార్, శోభ తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో యువకుడి మృతదేహం

**ముద్దనూరు, మార్చి 06, ప్రభాతవార్త:**



మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపమున గురువారం నాడు ఉదయం పంట పొలాల్లో మృతదేహం ఉన్నట్టు స్థానిక ప్రజలు సిఐ దస్తగిరికి సమాచారం తెలుపగా సిఐ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతుని దగ్గర పరిశీలించగా అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం, భద్రంపల్లి గ్రామానికి చెందిన బుల్లె అశోక్, వయస్సు 32 సంవత్సరములు, తండ్రి.నాగేంద్ర అని తెలిపారు. మృతుడు బేల్దారు పని చేసుకుంటూ జీవనం సాగించే వాడని భార్య భర్త ల మధ్యన మనస్పర్థలు ఉన్నవని, దాంతో మద్యం సేవించి గ్రామాలు వెంట తిరిగేవాడు అని తండ్రి నాగేంద్ర ఫిర్యాదు చేయగా పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

**గాలివీడు, మార్చి 6(ప్రభాతవార్త):**



ఉపాధి పనుల్లో అవకతవకలు పాల్పడితే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం సిబ్బందిని హెచ్చరించారు. గురువారం మండలంలోని గాలివీడు, గోరాన్‌చెరువు, నూలివీడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. నూలివీడు గ్రామంలో జరుగుతున్న పనుల్లో కొలతలు, పనుల పారదర్శకతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తీరు మారకుంటే విధుల నుండి తొలగించాల్సి వస్తుందని టీఏ శివశంకర్‌ను హెచ్చరించారు. మండల పరిధిలోని టీఏలు, ఎఫ్ఏలు సమన్వయంతో రైతులకు ఉపయోగపడే విధంగా ఫారం పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి రూ.300 పొందాలని, జాబ్‌కార్డుల్లో ఉన్నవారు కాకుండా డమ్మీలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనురాధ లక్ష్మికి నారీ శక్తి పురస్కార్ 2025



**మైదుకూరు, మార్చి 06, ప్రభాతవార్త:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఎం.అనురాధ లక్ష్మికి నారీ శక్తి పురస్కార్ 2025 అవార్డుకు ఎంపిక కావటం పట్ల ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమం ట్రస్ట్ మరియు నేస్తం సేవా సమితి మైదుకూరు వారు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా 2025 నారీ శక్తి పురస్కార్ అవార్డును ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఎం. అనురాధ లక్ష్మిని ఎంపిక చేసి, గురువారం నాడు కళాశాలలో, ప్రశంసా పత్రం మెమెంటో మరియు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ అనురాధ లక్ష్మి కళాశాలలో అన్ని కార్యక్రమాలను క్రమశిక్షణగా ఓర్పుతో నేర్పుతో పట్టుదలతో తమ విధి నిర్వహణ చేయడమే కాకుండా కళాశాలలోని విద్యార్థులను తమ సొంత పిల్లల కన్నా ఎక్కువగా పోషిస్తూ ఉన్నారని, సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వీరభద్ర సేవా సంస్థ చైర్మన్ మాల కొండయ్య మాట్లాడుతూ అనురాధ లక్ష్మి కళాశాలకి మరియు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. కళాశాల ఉప ప్రధానాచార్యులు సుభాన్ సాహెబ్,మహిళా దినోత్సవం 2025 థీమ్ యాక్సిలరేట్ యాక్షన్ " నెమ్మదిగా పురోగతి కాకుండా ధైర్యంగా, నిర్ణయాత్మక చర్యల ద్వారా లింగ సమానత్వాన్ని పెంచాల్సిన తక్షణ అవసరాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, సీనియర్ అధ్యాపకులు సుబ్బరాయుడు,రామేశ్వర్ రెడ్డి, అయ్యవారు రెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, చెన్న రాయుడు, శ్రీనివాసులు తదితర అధ్యాపకులు, మరియు బోధనేతర సిబ్బంది కిషోర్, శివ, చెంద్రయుడు, వర్ధన్, మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

**మదనపల్లి క్రైమ్, మార్చి 6 ప్రభాతవార్త.**



దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. గురువారం బసినికొండ పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్ మాట్లాడుతూ జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ రియాజ్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు కంటి చూపు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కంటి చూపు పరీక్షల్లో ఉచితంగా అద్దాలను పంపిణీ చేశామన్నారు.

## విద్యార్థినిలకు పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్



**తొండూరు మార్చి 6 (ప్రభాతవార్త):**

స్థానిక తొండూరు మండలంలోని పోలీస్ స్టేషన్ యందు ఎస్సై పెద్ద ఓబన్న ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు మహిళా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థినిలను స్టేషన్ లో పోలీస్ రిసెప్షన్ ,లాకప్, లాటి, కేస్ ఫైల్ వాటిని గుర్చి విద్యార్థులకు వివరించడం జరిగింది. రాబోవు తరంలో మీరు కూడా ఒక అధికారిగా ఏ విధంగా విధులు నిర్వహించాలి సమస్యలను ఎలా పరిష్కరించాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తొండూరు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ కానిస్టేబుళ్లు హోంగార్డులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు.

## మాజీ ముఖ్యమంత్రిను కలిసిన విద్యాసాగర్

**బద్వేలు అర్బన్, మార్చి 6 (ప్రభాతవార్త):**



తాడేపల్లి గూడెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బద్వేలు పట్టణానికి చెందిన జీఎన్ సిల్వర్‌షాపు యజమాని, వైసీపీ నాయకులు విద్యాసాగర్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అందించి అభినందనలు తెలిపారు. అనంతరం విద్యాసాగర్ కూటమిప్రభుత్వంలో స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయారు. వైసీపీ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ తొమ్మిది నెలల కాలంలోనే లక్షా 35 వేల కోట్లు కూటమి ప్రభుత్వం అప్పులు చేసిందని ఆ నిధుల ద్వారా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్కహామీ నెరవేర్చలేదన్నారు. వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఇంతరకు ఏ అభివృద్ధి లేదని తెలిపారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్స్ ధర్నా




**యర్రగుంట్ల మార్చి 6 ప్రభాతవార్త**

పట్టణ పరిధిలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎర్రగుంట్లలోని నాలుగు రోడ్ల కూడలి యందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా 15 వేల రూపాయలు చెల్లించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. గత ప్రభుత్వం కంటే ఫోటో ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెరుగైన పథకాలతో ఆటో కార్మికులను ఎన్నికల ముందు వాగ్దానం చేయడం జరిగింది దాన్ని ఆచరణలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు డిగ్రీలు పీజీలు చేసినా కూడా ఉద్యోగ అవకాశాలు లేక సొంత పెట్టుబడితో ఆటోలు జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం నుండి సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ఏఐటియుసి నాయకులు ఎం నారాయణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి, ఈ శరత్, సిపిఐ సీనియర్ నాయకులు జి ప్రతాప్, ఆటో కార్మికులు సుబ్బయ్య, రామయ్య, తిరుపాల్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**ఎర్రగుంట్ల మార్చి 06 ప్రభాతవార్త**

పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాసే 169 విద్యార్థులకు ప్రొద్దుటూరు స్టార్ రైన్ ఫైనాన్స్, సెట్స్ వ్యవస్థాపకులు ఎస్ శ్రీనివాస్ రెడ్డి ఈరోజు పరీక్ష సామాగ్రిని అందజేశారని పాఠశాల ఎంఈఓ 2 ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పదవ తరగతి పరీక్షలు బాగా వ్రాసి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు.ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి పాఠశాల సెకండ్ ర్యాంక్ వారికి (రెండవ స్థానం సాధించిన వారికి) 5000/రుపాయలను అందజేస్తామని అన్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించి తల్లితండ్రులకు ఉపాధ్యాయులకు పాఠశాలకు మంచి పేరు సాధించి గొప్ప వ్యక్తులుగా తయారై సమాజానికి ఉ పయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, చంద్ర ఓబులరెడ్డి, నాగార్జునలు పాల్గొన్నారు.

## ఫలితాలలో విద్యార్థుల ప్రభంజనం

**రాయచోటి మార్చి 6 ప్రభాత వార్త**



అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, జేఎన్టీయూ యూనివర్శిటీ విడుదల చేసిన మేనేజ్మెంట్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ యూనివర్సిటీ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించారని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మేనేజ్మెంట్ విభాగంలో బి. అమృత 85.5 తో మొదటి ర్యాంకు, ఎస్ షాహీన్, ఎస్.రుమానా, ఎస్.కౌసర్, ఎస్.నందిని 83.37తో రెండవ ర్యాంకు ఎస్. అతిఫా బేగం 83.25 తో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలియజేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులను మరియు ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. కళాశాల యందు అమలు పరుస్తున్న అకాడమిక్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్లేస్మెంట్ ట్రైనింగ్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, వర్క్ షాప్స్ సెమినార్స్ వంటి అంశాలను ప్రామాణికంగా చేసుకొని యు.జి.సి సంస్థ నుండి నాక్ బి ప్లస్ గ్రేడ్ గుర్తింపు రావడం గర్వకారణం అని వివరిస్తూ యుజిసి అటానమస్ ప్రక్రియను వేగవంతం చేశామని తద్వారా ఆధునిక శాస్త్ర సాంకేతిక అంశాలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ , మేనేజ్మెంట్ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్ మరియు అధ్యాపకులు అభినందించారు.

# మహిళా దినోత్సవ సందర్భంగా ముగ్గుల పోటీలు



**ప్రొద్దుటూరు మార్చి 6 ప్రభాతవార్త**

పట్టణం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణంలో మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ మరియు వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొద్దుటూరు డిఎస్పి పుతి భావన హాజరైనట్లు నిర్వాకులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు విద్యార్థినిలు వేసినటువంటి ముగ్గులను పరిశీలించి డిఎస్పి వారిని అభినందించారు. సంస్కృతి సంప్రదాయాలను పాటించడంలో మహిళల పాత్ర అమోఘమని ఆమె కొనియాడారు. సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహిళలు ముగ్గుల పోటీలలో ఎంతో ప్రతిభ కనపరచడం సంతోషకరమన్నారు. ఒక ప్రణాళిక బద్ధమైనటువంటి కుటుంబ వ్యవహారాలను తీర్చిదిద్దే శక్తి మహిళకు ఉంటుందని తెలియజేశారు. శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళా మణుల కోసం వారి యొక్క ఔన్నత్యం కోసం ఎన్నో కార్యక్రమాలు రాము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ మాట్లాడుతూ మా కళాశాల వేదికగా మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఈ కార్యక్రమా నిర్వహణకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ గౌరీ శంకర్, దావీద్ డాన్సర్ మహి, భారతి, జ్యోతి, సలీం కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు గురుకుల పాఠశాలలకు సన్నబియ్యం

**పీలేరు మార్చి 6 ప్రభాతవార్త:**

అంగన్వాడీ కేంద్రాలకు సంక్షేమ వసతి గృహాలకు గురుకుల విద్యాలయాలకు త్వరలో సన్న బియ్యం రానున్నాయని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పీలేరు పట్టణంలో నాలుగు అంగన్వాడి కేంద్రాలు, మూడు గురుకుల పాఠశాలలు, ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ త్వరలో సంక్షేమ వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాల్లోని విద్యార్థుల ఆకలి తీర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేయనున్నట్లు చెప్పారు. స్థానిక ఎల్బిఎస్ రోడ్డులోని 8వ నెంబరు చౌక దుకాణాన్ని తనిఖీ చేసి డీలరు కుసుమకుమారితో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇస్తున్న ఉచిత బియ్యం వినియోగదారులకు సక్రమంగా అందజేయాలని ఆదేశించారు. అలాగే ఆ చౌక దుకాణంలో తూనికలు సక్రమంగా ఉన్నాయా లేదా అని, పప్పు, చక్కెరకు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారా అని లబ్ధిదారులతో వాకబు చేశారు. అలాగే చౌక దుకాణం నుంచి అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న నిత్యవసర సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అక్కడికి సమీపంలోని పాలాలవారి వీధిలోని అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి చరవాణి ద్వారా గర్భవతులు, చిన్న పిల్లల తల్లులతో మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సక్రమంగా సరఫరా అవుతోందా లేదా అని ఆరా తీశారు. అదేవిధంగా మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారా లేదా అని కూడా విచారించారు. పట్టణ శివారులోని చిత్తూరు మార్గంలోని జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాల, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయం, తిరుపతి మార్గంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలను సందర్శించారు. ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి

# వర్క్‌ఫ్రం హోం సర్వే ముమ్మరం



**కలికిరి, మార్చి 6, ప్రభాతవార్త:**

మండలంలోని 14 పంచాయతీలలో ఎంపీడీవో భానుమూర్తిరావు పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వర్క్‌ఫ్రం హోం సర్వేని ముమ్మరం చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 60లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది. దీంతో ఏపీ ప్రభుత్వం ఐటీ, ఇతర ఉద్యోగాలకు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించేందుకు ఉద్యోగ కల్పన కోసం సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేసి యువత ఎవరెవరు వర్క్‌ఫ్రం హోం నిర్వహిస్తున్నారు, వారికి గల సౌకర్యాలు, అలాగే ఇంట్లో మరికొంత కాలం కార్యాలయాలలో ఏవైనా వర్క్ చేస్తున్నారా అనే అంశాలపై సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేని గురువారం ఎంపీడీవో భానుమూర్తిరావు ఆకస్మిక తనిఖీ చేసి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సచివాలయ సిబ్బంది సర్వే వేగవంతం చేయాలని సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు. మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడలో గురువారం సాయంత్రం సచివాలయ సమయపాలన ముగిసినా డిజిటల్ అసిస్టెంట్ మహేష్ ఇంటింటికి వెళ్లి వర్క్‌ఫ్రం హోం సర్వే నిర్వహించారు.

## నాసాలో మరోసారి సత్తా చాటిన విద్యార్థులు

**మదనపల్లి, మార్చి 6 ప్రభాతవార్త**

ఇటీవల దేశవ్యాప్తంగా NASA -NSS వారు నిర్వహించిన లివింగ్ ఇన్ హెల్తీ స్పేస్ కాంటెస్ట్ 202425 లో మదనపల్లి పట్టణంలోని మల్లికార్జున సర్కిల్ శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలోని 7వ తరగతి విద్యార్థులు స్పేస్ ఫార్మింగ్ ఫర్ క్యాబేజ్ అనే అంశంపై చేసిన ప్రాజెక్ట్ స్టేట్ లెవెల్ ఫస్ట్ ప్రైజ్ సొంతం చేసుకుందని పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ విజయం మా పాఠశాలను మరో అడుగు ముందుకు వెయ్యడానికి ఎంతో సహకరిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. సంస్థ ఏజీఎం సురేష్ మాట్లాడుతూ చిన్న వయసులో నాసా వంటి కార్యక్రమాల్లో విజయాన్ని పొందడం గొప్ప విషయమని పిల్లలను అభినందించారు. ఆర్ఐ శ్రీధర్ మాట్లాడుతూ నేటి కాలం సైన్స్‌తో ముడిపడి ఉందని అందులో భాగంగా విద్యార్థుల ప్రాజెక్టులు ఉన్నాయని, ఇలాగే విద్యార్థులు మంచి విజయాలను పొందాలని ఆశీర్వదించారు. ఈ ప్రాజెక్టు నిర్వహించిన జి. ఆలీబాబా,వి. మనోజ్ కుమార్, పీ.జీ.పునీత్ రెడ్డి, ఏ. సలీముల్లా ,ఎల్.ఎస్. యష్రఫ్ అహ్మద్, ఎం.ఎస్. అబూ అస్రార్ లను అప్రిషషన్ సర్టిపికెట్లు మరియు మెడల్స్‌తో సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ వి.ఎస్ రఘునాథ్, డీన్ నూరు, సిబ్బాచ్ ఇన్చార్జ్ వెంకటేష్, నాసా మెంటర్ సుప్రియ, నాసా ఇంచార్జ్ భవ్యశ్రీ, సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# పదవ తరగతి లో అత్యుత్తమ ఫలితాలు సాదించాలి

**సుండుపల్లి, మార్చి06, ప్రభాతవార్త:**

మండలపరిది లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ నందు కరస్పండెంట్ నాగేశ్వరావు అధ్యక్షతన రాబోయే పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు మరియు పరీక్షకు హాజరు అవుతున్న పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరపడం జరిగినదని తెలియజేసారు. రాబోయే పదవ తరగతి విద్యార్థుల కోసం సరస్వతి పూజ చేయడం స్కూల్ వదలి వెళ్ళు తున్నటువంటి 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరపడం జరిగినది. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతు విద్యార్థులు అందరు మంచిగా చదివి అత్యుత్తమ ఫలితాలతో మీరు చదువుతున్న పాఠశాలకి అలాగే మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సమాజంలో ఒక మనిషికి గుర్తింపు రావాలంటే చదువు ఒక్కటే ముఖ్యమని తెలియజేశాడు. చదువుకుంటే సమాజంలో నీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉంటాయి అని తెలియజేసాడు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. 10 వ తరగతి పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి కి ప్యాడ్, పెన్ను, పెన్సిల్, స్కెలు మరియు విద్యార్థి పేరు తో కూడుకొన్న మెమెంటో బహుమతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.



# రెండవ రోజు కోదండ రామాలయంలో మహా సంప్రోక్షణ

**ఒంటిమిట్ట మార్చి 6 ప్రభాతవార్త**

శాస్త్రోక్తంగా శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో రెండవ రోజు అయినా గురువారం మహా సంప్రోక్షణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో మహా సంప్రోక్షణ మరియు కుంభాభిషేకం కార్యక్రమాలు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు ఈ సంప్రోక్షణ కార్యక్రమం మార్చి 9న ఉదయం 10.15 నుండి 11:30 గంటల వరకు వృషభ లగ్నంలో మహా సంప్రోక్షణతో ఈ కార్యక్రమం ముగుస్తుంది. టీటీడీ ఆగమ సలహాదారులు మరియు ప్రధాన కంకణబట్టర్ శ్రీ రాజేష్ స్వామి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 7.30 గంటలకు భగవత్పుణ్యాహము, అగ్ని మథనము, యాగశాలలో వైధిక కార్యక్రమాలు, మహా కుంభ, ఉపకుంభ, చక్రబ్జా మండల, పరివార కుంభారాధనలు, ప్రధాన మూర్తి హోమములు, శ్రీ మద్రామాయణ హవన ప్రారంభం, మన్మోహన శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు చతుస్థానార్చనము, సహస్ర కళాశాదివాసం, వేదాది పారాయణం, మూర్తి హోమం, పరివార హోమములు, పూర్ణాహుతి సాత్తుమొర జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవోలు శ్రీ నటేష్ బాబు, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నవీన్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.







## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



**గాలివీడు, మార్చి 6(ప్రభాతవార్త):**

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్లో విద్యార్థులకు పోలీసు ఆయుధాల ప్రదర్శన(ఓపెన్‌హౌస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లి దండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. అనంతరం పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వారు వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, పోలీస్ కంట్రోల్ రూం, కమ్యూనికేషన్స్, నేర దర్యాప్తు విధానం తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

**సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి**

**మదనపల్లె, మార్చి 6 ప్రభాతవార్త :**

ఈనెల 8న శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామంటూ జిల్లా న్యాయసేవ అదికార సంస్థ కార్యదర్శి, సీనియల్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి తెలిపారు. గురువారం జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కక్షదారులు పాల్గొని కేసులు రాజీ చేసుకోవాలని తెలిపారు. కేంద్ర న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చిత్తూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమరావ్ ఆధ్వర్యంలో శనివారం నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉమ్మడి చిత్తూరుజిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కారం చేసుకోవడం వల్ల కక్షదారులకు సమయంతో పాటుగా ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమ తీర్పు అన్నారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీస్, వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిదులు,కక్షదారులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.



ఎంఎస్.భారతి

## ప్రజాభిప్రాయ సేకరణను ప్రభుత్వానికి నివేదిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

**మదనపల్లె, మార్చి 6 ప్రభాతవార్త :**

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి స్వచ్ఛందసంస్థలు, పర్యావరణ పరిరక్షణ మండలి బోర్డు,గ్రామ ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ మండలికి నివేధిస్తామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. గురువారం రూరల్ మండలంలోని కోటవారిపల్లె గ్రామ పంచాయితీలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. క్వారీకి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ క్వారీ అనుమతులకు సంబంధించి పర్యావరణ పరిరక్షణకు సంబంధించి స్వచ్ఛందసంస్థలు, పర్యావరణపరిరక్షణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు వారి వారి అభిప్రాయాలను వెల్లడించారన్నారు. క్వారీ యజమాన్యం కూడా పర్యావరణాన్ని దెబ్బతియకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కాలుష్య నివారణకు మొక్కలు పెంపకం, గ్రామ ప్రజలకు రోడ్డు, వైద్య సౌకర్యాలు, శుద్ధిచేసిన నీటిసరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేధిస్తామన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ దనాంజనేయులు, పర్యావరణ ఇంజనీర్లు, యాజమాన్యం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కడప రేణిగుంట ఎక్స్‌ప్రెస్ హైవే

## జాప్యంపై పార్లమెంట్ల ప్రస్తావిస్తా

**ఎంపి మేడా రఘునాథరెడ్డి**



వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో జగన్‌తో మేడా రఘునాథరెడ్డి

**రాజంపేట అర్బన్, మార్చి 6 ప్రభాతవార్త**

పార్లమెంట్ సమావేశాలలో కడప రేణిగుంట ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణం జాప్యంపై ప్రస్తావిస్తానని వైసిపి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి లో వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో పలు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చాలా ఆలస్యమైందన్నారు. సంబంధిత అధికారులతో ఇప్పటికీ తాను చర్చించినట్లు తెలిపారు. అంతే కాకుండా కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర పర్యావరణ మంత్రులతో ఇప్పటికే కలిసి వివరించడం జరిగిందన్నారు. అయినా అధికారులు ఇంకా వివిధ అనుమతులు ఇవ్వడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అందుకే ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం పై చర్చించేందుకు పార్టీ తరఫున కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్లమెంట్లో వివిధ సమస్యలను ప్రస్తావించే విషయమై జగన్ పలు సలహాలు ఇచ్చారన్నారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు రాష్ట్ర సమస్యలపై చర్చించేందుకు పాటుపడుతా అన్నారు.

## శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ప్రత్యేక పూజలు

**వాల్మీకిపురం మార్చి 6 ప్రభాతవార్త:**

తితిదే ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం శ్రీకృష్ణుడి జన్మ నక్షత్రమైన రోహిణి నక్షత్రంయి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఉదయం స్వామి వారికి నిత్యసేవలు అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఊంజల్ మండపంలో స్వామివారికి స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. తదుపరి విశేషాలంకరణలో ముస్తాబైన రుక్మిణి, సత్యభామ సమేత పాండురంగ విఠలేశ్వరస్వామి వారు తిరుచ్చిని అధిరోహించి, వాల్మీకిక్షేత్రంలోని నాలుగుమాడ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు కొబ్బరికాయ, కర్పూరంలను సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు ఈ కార్యక్రమంలో వేదపండితులు కృష్ణస్వామి, బషికాచార్యులు, కుమార్ స్వామి, తితిదే అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నగరోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## క్రీడా పోటీలో ప్రతిభకు పట్టం



**సుండుపల్లి, మార్చి06, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని హైస్కూల్ మరియు జూనియర్ కళాశాల విద్యార్థులు 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ 2024 25 సంవత్సరంలో మహారాష్ట్రలో జరిగిన క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్లస్ 2 జూనియర్ కళాశాల సుండుపల్లి విద్యార్థులు ఎన్. బేబీ,కె. ఆంజనేయులు ఇంటర్ ప్రథమ సంవత్సరం జాతీయస్థాయిలో సాఫ్ట్బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి నందుకు గాను అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.జయన్న మరియు పిడిలు కె.రవీంద్ర రాజు, రాధా రాణిలు పాల్గొన్నారు

## మరో 39 సేవలు వాట్సప్ ద్వారా పెంపు

**200కు చేరుకున్న ప్రభుత్వ సేవలు**

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )**

రాష్ట్రప్రజలకు ఏపీలోని ఎన్డీఏ ప్రభుత్వము వాట్సప్ ద్వారా అదనంగా మరో 39 సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతము మొదటి విడతలో వాట్సప్ ద్వారా 161 సేవలను రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వము ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు వాట్సాప్ ద్వారా ప్రజలకు మొత్తం 200 రకాల ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా ఉపయోగించుకునే సౌలభ్యం లభించింది. ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా అందించడం కోసం " మన మిత్ర " పేరుతో దేశంలోనే తొలిసారి ఏపీ ప్రభుత్వం వాట్సాప్ సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే. అన్ని రకాల సర్టిఫికెట్లు, హాల్ టికెట్లు, రెవిన్యూ శాఖకు సంబంధించిన ల్యాండ్ రికార్డుల సర్టిఫికెట్లు వాట్సప్ ద్వారా ప్రజలు మనమిత్ర యాప్ ద్వారా పొందవచ్చు. వీటితో పాటు కరెంటు బిల్లులు, ఆస్తి పన్నులు, ఇతర ప్రభుత్వ చెల్లింపులు చేసుకోవచ్చు. తొలివిడతలో 161 సేవలను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం 39 సేవల పెంపుతో ఇప్పుడు ఆ సేవలను 200 కు పెంచి నట్లయింది. ఈ 200 సేవలతో పాటు రాబోయే రోజుల్లో మరిన్ని సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. " మన మిత్ర " సేవల కోసం వాట్సప్ లో 95523 00009 నెంబర్ ను సంప్రదించాల్సి ఉంటుంది.

## లేగ దూడల ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**వాల్మీకిపురం మార్చి 6 ప్రభావతవార్త:**

పాడి దూడల పెంపకంలో నట్టలను నివారిస్తేనే ఆరోగ్యంగా దూడుల ఎదుగుదల సాధ్యమోతుందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్పిళ్లై అన్నారు. గురువారం మండలంలోని నగిరిమడుగు పంచాయతీలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమాన్ని తెదేపా రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకట్రమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డిలతో కలిసి పిళ్లై ప్రారంభించారు. ఈ ప్రదర్శనకు వివిధ జాతులకు చెందిన 113 దూడలను ప్రదర్శనకు పెట్టారు పాడి రైతులను ఉద్దేశించి పిళ్లై మాట్లాడుతూ లేగదూడులన్నింటికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా నట్టలమందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే లింగ నిర్ధారిత వీర్యము ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించుకొనటం వల్ల మేలు జాతి మంచి పాలసారగల దూడలు పుడుతాయని తెలిపారు ఏపీ రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పశువు ఎదకొచ్చినప్పుడు కృత్రిమ గర్భధారణ ద్వారా ఎదసూదులు వేయించడం వల్ల మేలు జాతి దూడలు ఉత్పత్తి అవ్వటమే కాకుండా అవి త్వరగా కట్టు ప్రాయానికి వచ్చి ఒకటిన్నర నుంచి రెండు సంవత్సరంలోగా కట్టి ఈనుతాయని చెప్పారు కనుక పాడి రైతులు మేలు జాతి దూడలను ఎంచుకుని అధిక పాల దిగుబడులు పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో వాల్మీకిపురం సహాయ సంచాలకులు డాక్టర్ నీరజ, వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ చరిత, ఏహెచ్‌ఎలు సురేంద్రరెడ్డి, రెడ్డి వరప్రసాద్, మోహన్, గోపాలమిత్ర రమేష్ తెదేపానాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి అమ్మవారి గ్రామోత్సవం



**సుండుపల్లి, మార్చి06, ప్రభాతవార్త:**

మండల కేంద్రానికి సమీపంలోని చెన్నం శెట్టి పల్లి వద్ద వెలసి ఉన్న సుండుపల్లి ఎల్లమ్మ తల్లి అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరుణాల ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అంకురార్పణ అమ్మవారి ఊరేగింపు గ్రామంలో నిర్వహించి మంగళహారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారికి అభిషేకం పుట్ట బంగారు తెచ్చి పూజించడంతో పాటు పొంగు పాలు కార్యక్రమం ఉంటుందని శనివారం అమ్మవారికి పూజా కార్యక్రమాలు మంగళహారతి తీర్థప్రసాదం సాయంత్రం అన్నదాన కార్యక్రమం అనంతరం అంగరంగ వైభవంగా రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ చే బాణాసంచా కాలుస్తూ చాందిని బండ్లు తిరుగు తాయని, ప్రత్యేకంగా అలంకరించిన గుర్రాల రథంపై గ్రామ దేవత ఎల్లమ్మ తల్లి గ్రామోత్సవం నిర్వహిస్తారని భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించు కొంటారు.

## భూఆక్రమణలపై విచారణ : కలెక్టర్

**పీలేరు మార్చి 6 ప్రభాతవార్త**



పీలేరు గత వైసీపీ ప్రభుత్వంలో పీలేరు మండలంలో చోటు చేసుకున్న భూ ఆక్రమణలపై విచారణ చేపట్టామని, అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గురువారం కలెక్టర్ పీలేరులో పర్యటించి తహశీల్దార్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ రెవిన్యూ సదస్సులో వచ్చిన అర్జీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ పీలేరు మండల వ్యాప్తంగా 550 అర్జీలు వచ్చాయని వాటిలో 500 వరకు సమస్యలు పరిష్కరించామని 50 అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని. మిగతా వాటికి కూడా సమస్య పరిష్క రిస్తామని ఆయన అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలు పరిష్కరించ లేమని ఆయన స్పష్టం చేశారు. పీలేరులో జరుగుతున్న భూ ఆక్రమణలపై శరవేగంగా సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం ఆరు పంచాయతీల పరిధిలో 600 ఎకరాలు ప్రభుత్వ డికేటి భూముల ఆక్రమణకు గురైనట్లు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సిఫారసు మేరకు విచారణ చేపట్టామని ఈ విచారణ 338 ఎకరాలు ఇప్పటికే పూర్తి చేసామని మిగతా భూములు కూడా విచారణ పూర్తి చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఈ విచారణలో బయటపడ్డ భూ ఆక్రమణలు తొలగిస్తామని ఎన్ని అడ్డంకులు ఉన్న వెనకడుగు వేసే ప్రసక్తి లేదని ప్రభుత్వ భూములు కాపాడటమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. డికెటి, ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వేసి పేద, మధ్యతరగతి ప్రజలకు విక్రయిస్తున్నారని ఈ వ్యవహారంలో సర్వే నెంబర్లు మార్చి ఇతరులకు విక్రయిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.